



విలేకరులతో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ఎంపీ రంజిత్‌రెడ్డి దోచుకునేందుకే వచ్చాడు

- జిల్లాలో భూముల స్కాములన్నింటిలో పాత్రధారే ..
- కోళ్లదాణ, కోడిగుడ్ల కుంభకోణాలకు సూత్రధారి ఆయనే
- ఫిల్మ్‌నగర్, నానక్‌రాంగూడ, గోపన్నపల్లి భూకుంభకోణాల వెనుక పాత్ర ఆయనదే
- త్వరలో విచారణ సంస్థలకు ఫిర్యాదు చేస్తాం
- బీజేపీ నేతలు రత్నం, రవి యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి ధ్వజం

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి)

చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఆస్తులు కొల్లకొట్టేందుకే వచ్చారని బీజేపీ నేతలు ఆరోపించారు. జిల్లాలోని పలు భూముల కుంభకోణాలతో పాటు రాష్ట్రంలో కోళ్లదాణ, కోడిగుడ్ల స్కామ్‌లకు ఆయనే సూత్రధారి అని ఆరోపణలు చేశారు. లక్డీకాపూల్‌లో శనివారం బీజేపీ నేత, చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం పాటు రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్రీనివాస్‌రెడ్డి, శేరిలింగంపల్లి ఇన్‌చార్జ్ రవియాదవ్ తదితరులు విలేకరుల సమావేశం నిర్వహించి ఎంపీ రంజిత్‌రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. రియల్ ఎస్టేట్ సెటిల్‌మెంట్లు, దందాలు తప్ప ఆయన చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో ఏం అభివృద్ధి చేశారు? అని ప్రశ్నించారు. రంజిత్‌రెడ్డికి స్థానిక ప్రజల సమస్యలపై అవగాహన లేదు.. వాటిని పరిష్కరించాలనే ధ్యాసే లేదన్నారు. ఆయనకు తెలిసిందంతా మందిని బ్లాక్ మెయిల్ చేస్తూ రాజకీయ నేతలను కొనుగోలుచేసి భూములు కొల్లగొట్టడమేనన్నారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో రోడ్లన్నీ అస్తవ్యస్తంగా ఉన్నా ఆయన ఫాంహౌస్‌కు మాత్రం కొత్త రోడ్డు వేసుకున్నారని ఎద్దేవా చేశారు. ఇటీవల వెలుగులోకి వచ్చిన నానక్‌రాంగూడ, గోపన్నపల్లి భూముల కుంభకోణాలతో పాటు ఫిల్మ్‌నగర్‌లో రూ.వందల కోట్ల విలువైన దేవాలయ భూములు కొల్లకొట్టిన వ్యవహారంలో కూడా రంజిత్‌రెడ్డే సూత్రధారి అని విమర్శించారు. మాజీమంత్రి కేటీఆర్‌తో కలిసి హైదరాబాద్ శివార్లలో అనేక భూ దందాలు చేశారని.. వీటన్నింటిపై తాము విచారణ కోరతామన్నారు. ఇక్కడ ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతుంటే ఈ ప్రాంతం నుంచి ఎన్నికైన పార్లమెంట్ సభ్యుడు రంజిత్‌రెడ్డి ఈ ప్రాంత అభివృద్ధికి నోరు విప్పలేదన్నారు. స్వలాభం కోసమే రాజకీయాలు చేస్తున్నారన్నారు. 5 ఏళ్లలో ఒక్క ప్రాజెక్టు తీసుకు రాలేదని విమర్శించారు. చేవెళ్ల - ప్రాణహిత ప్రాజెక్టు రద్దుచేసినా, రంగారెడ్డి, - పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్టు పనులు జరగకున్నా ఆయన ఎక్కడా ప్రశ్నించిన దాఖలాలు లేవన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వైఖరి వల్లే హైదరాబాద్ - బీజాపూర్ హైవే పనులు నిలిచిపోయాయని, రోడ్డు విస్తరణ పనులు ఆగిపోతే ఎంపీ రంజిత్‌రెడ్డి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఇంత అసమర్థ ఎంపీని తాము ఎక్కడా చూడలేదన్నారు. శంకరపల్లిలో డబుల్‌బెడ్ రూం ఇళ్ల కేటాయింపులో స్థానికులకు అన్యాయం జరిగితే ఆయన ఎక్కడున్నారన్నారు. చేవెళ్లను మున్సిపాలిటీ చేస్తామని ఒక తప్పుడు పత్రం తెచ్చి స్థానికులను రంజిత్‌రెడ్డి వంచించారని బీజేపీ నాయకులు విమర్శించారు.

నోరు అదుపులో పెట్టుకోకుంటే తగిన శాస్తి చేస్తాం

ఎంపీ రంజిత్‌రెడ్డి నోరు అదుపులో పెట్టుకోవాలని బీజేపీ నేతలు హితవు పలికారు. వేరే జిల్లా నుంచి ఇక్కడకు వచ్చి కుయుక్తులు, డబ్బుతో రాజకీయం చేస్తున్న రంజిత్‌రెడ్డి ఇకనైనా నోరు అదుపులో పెట్టుకోకుంటే తగి శాస్తి చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. రాజకీయాల్లో ఇలాంటి మూర్ఖులను తాను ఇంత వరకు చూడలేదని మాజీ ఎమ్మెల్యే రత్నం అన్నారు. ఇటీవల మాజీ ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డిపై రంజిత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలపై తక్షణమే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. రెండు రోజుల కిందట ఒక సర్పంచికి మాజీ ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి ఫోన్ చేసి తమ పార్టీ సిద్ధాంతాలు నచ్చితే బీజేపీలోకి రావాలని కోరారని చెప్పారు. దీనిపై రంజిత్‌రెడ్డి స్పందించిన తీరు సిగ్గుచేటన్నారు. రంజిత్‌రెడ్డి దీనిపై విశ్వేశ్వర్‌రెడ్డికి ఫోన్ చేసి సభ్యసమాజం తలదించుకునే రీతిలో మాట్లాడరన్నారు. రాజకీయాల్లో ఎలాంటి మచ్చలేని విశ్వేశ్వర్‌రెడ్డిపై పత్రికల్లో రాయలేని భాషను వాడారని.. దీన్ని ఎట్టి పరిస్థితుల్లో సహించేదిలేదన్నారు. ఈ విషయంలో రంజిత్‌రెడ్డిపై కేసు నమోదు చేసే యోచనలో తామున్నట్లు తెలిపారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో తాము కొన్ని దశాబ్ధాలుగా రాజకీయాల్లో ఉన్నామని.. కానీ ఇలాంటి వ్యక్తులను ఎన్నడూ చూడలేదన్నారు. ఓటమి భయంతోనే రంజిత్‌రెడ్డి చిల్లర వ్యవహారాలు చేస్తున్నారన్నారు. డబ్బు, హోదాను చూసి అహంకారంతో వ్యవహరిస్తున్నారని.. ఆయనకు ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. 500 ఏళ్ల భారతీయుల చిరకాల స్వప్నం అయోధ్యలో రామమందిరం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ప్రజలంతా పండుగ చేసుకుంటున్నారని చెప్పారు. ఈ కార్యక్రమం రోజైన 22న అనేక రాష్ట్రాలు సెలవుదినంగా ప్రకటించినందున రాష్ట్ర ప్రభుత్వం కూడా సెలవు ప్రకటించాలని కోరారు. విలేకరుల సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి, చేవెళ్ల కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, పరిగి నేత పరమేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఉమ్మడి జిల్లాలో నీటికష్టాలు తప్పేలా లేవు. ఈ ఏడాది పుల్లుగా వర్షాలు కురిసినా చాలాచోట్ల భూగర్భజలాలు అడుగంటాయి. విచ్చలవిడిగా నీటి వాడకం వల్లే ఈ పరిస్థితులు ఎదురయ్యాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. నీటి లభ్యత సరిపోను లేకపోవడంతో పంటల సాగు కూడా దారుణంగా పడిపోయింది. ఏ జిల్లాలోనూ నలభై శాతానికి మించి పంటలు సాగు కాలేదంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికే ఇంత దారుణ పరిస్థితి ఉంటే వేసవి కాలంలో నీటి కటకట మరింత తీవ్రమయ్యే ప్రమాదముందని ఉమ్మడి జిల్లావాసులు ఆందోళనకు గురవుతున్నారు.

వేసవికి ముందే.. ప్రమాద ఘంటికలు!

ఉమ్మడి జిల్లాలో శరవేగంగా అడుగంటుతున్న భూగర్భజలాలు

- వానాకాలంలో భారీ వర్షాలు కురిసినా కానరాని నీటి నిల్వలు
- యాసంగి సీజన్‌లో వర్షాలు అంతంతమాత్రం కావడంతో నీటి కష్టాలు
- నాలుగేళ్లలో కనిష్టస్థాయికి పడిపోయిన భూగర్భజలాలు
- విచ్చలవిడి నీటి వినియోగంతో తంటాలు
- శేరిలింగంపల్లిలో అత్యధికంగా 15.29 మీటర్ల లోతులో భూగర్భజలాలు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో భూగర్భజలాల పరిస్థితి ఆందోళన కరంగా ఉంది. వేసవికి ముందే భూగర్భజలాలు అడుగంటడంతో యాసంగి పంటలపై ప్రభావం పడే అవకాశం కనిపిస్తోంది. వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తే ప్రభావం ఉంది. గడిచిన నాలుగేళ్లలో ఎన్నడూ లేని రీతిలో భూగర్భజలాలు అడుగంటడంతో వేసవికి ముందే ప్రమాద ఘంటికలు మొగుతున్నాయి. వాస్తవానికి ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో గత ఖరీఫ్‌లో సాధారణానికి మించి భారీగా వర్షపాతం నమోదైంది. ఉమ్మడి జిల్లాలో గడిచిన వర్షాకాలం విస్తారంగా వర్షాలు పడడంతో చెరవులు, కుంటలు పూర్తిగా నిండిపోయాయి. పలు ప్రాంతాల్లో వరదలు కూడా వచ్చాయి. కొన్ని ప్రాంతాల్లో రికార్డుస్థాయిలో వర్షపాతం నమోదైంది. దీంతో వచ్చే వేసవిలో దండిగా భూగర్భ జలాలు ఉంటాయని అందరూ భావించారు. కానీ పరిస్థితి అంతా ఆశాజనకంగా కనిపించడం లేదు. కురిసిన వర్షపాతానికి భూగర్భ జలాలకు పొంతన లేదు. విచ్చలవిడిగా నీటి వాడకం పెరగడంతో శరవేగంగా భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. దీనికి కారణం రబీలో అంతంత మాత్రంగానే వర్షాలు కురవడంతో ఆశించిన స్థాయిలో భూగర్భ జలాలు పెరగలేదు. అనేక మండలాల్లో అక్టోబర్, నవంబర్ నెలల్లో కనిష్ట స్థాయిలో కూడా వర్షాలు పడలేదు. దీంతో ఈ మండలాల్లో వేసవిలో నీటి ఎద్దడి తలెత్తే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇక మరికొన్ని మండలాల్లో వర్షపాతం బాగానే ఉన్నప్పటికీ విచ్చలవిడి నీటి వాడకం వల్ల వేసవికి ముందే భూగర్భ జలాలు అడుగుంటుతుండడం ఆందోళన కలిగిస్తోంది. పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామీణ మండలాల్లో కూడా ఈ పరిస్థితి కనిపిస్తోంది. ముఖ్యంగా వికారాబాద్ జిల్లాలో భూగర్భ జలాల పరిస్థితి దారుణంగా ఉంది. అలాగే రంగారెడ్డి జిల్లాలో కూడా భూగర్భ జలాలు గణనీయంగా తగ్గిపోతుండడంతో ఈ ఏడాది వేసవిలో నీటి ఎద్దడి తీవ్రంగా ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. గడిచిన నాలుగేళ్లలో డిసెంబర్ నెలాఖరునాటి పరిస్థితులను పరిశీలిస్తే ఈ ఏడాదే ఆందోళన కరంగా ఉంది. డిసెంబరు నెలాఖరు నాటికి వికారాబాద్ జిల్లాలో సగటున 11.31 మీటర్ల లోతుకు భూగర్భ జలాలు పడిపోయాయి. అలాగే రంగారెడ్డి జిల్లాలో 8.68 మీటర్లు, మేడ్చల్ జిల్లాలో 8.50 మీటర్ల లోతుకు భూగర్భ జలాలు పడిపోయాయి. ఇక మండలాల వారీగా చూస్తే శేరిలింగంపల్లిలో భూగర్భ జలాలు శరవేగంగా పడిపోతున్నాయి. ఇక్కడ ఈ ఏడాది 31శాతం అధిక వర్షపాతం నమోదైనప్పటికీ భూగర్భజలాలు 15.29 మీటర్ల లోతుకు పడిపోవడం గమనార్హం.

2022 డిసెంబర్ -2023 డిసెంబర్ మధ్య భూగర్భజలాల వ్యత్యాసం	
రంగారెడ్డి	-2.74
మేడ్చల్	-2.17
వికారాబాద్	-3.10

నాలుగేళ్లలో భూగర్భజలాల పరిస్థితి (డిసెంబరు ఆఖరు నాటికి) మీటర్లలో..

జిల్లా	2020	2021	2022	2023
రంగారెడ్డి	5.81	5.81	5.94	8.68
మేడ్చల్	6.10	7.81	6.33	8.50
వికారాబాద్	8.34	7.93	8.21	11.31

ఈ ఏడాది వర్షపాతం వివరాలు

జిల్లా	సాధారణం	కురిసింది	పెరుగుదల/ తగ్గుదల శాతం
రంగారెడ్డి	660.5	656	-1
మేడ్చల్	733.3	793.1	8
వికారాబాద్	730.7	824.7	13

యాసంగిలో కానరాని వర్షాలు

ఖరీఫ్‌లో మూడు జిల్లాల్లో వర్షాలు దండిగా పడినప్పటికీ రబీలో కనీస స్థాయిలో కూడా వర్షాలు పడలేదు. దీంతోనే కష్టాలు మొదలయ్యాయి. ఖరీఫ్‌లో వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో సగటు కంటే 29శాతం అధిక వర్షపాతం నమోదు కాగా రంగారెడ్డి జిల్లాలో 19శాతం అధికంగా వర్షాలు కురిశాయి. అయితే రబీలో పరిస్థితులు తలకిందులయ్యాయి. రబీ సీజన్ ఆరంభమైన తరువాత వర్షాలు మోహం చాటేశాయి. దీంతో రబీ సీజన్‌లో మునుపెన్నడూ లేని విధంగా కరువు పరిస్థితులు తాండవిస్తున్నాయి. రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో రబీ సీజన్‌లో సగటు కంటే 82శాతం తక్కువగా వర్షాలు పడ్డాయి. వికారాబాద్ జిల్లాల్లో 80 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది.

సాగు సజావుగా సాగేనా?

యాసంగి సీజన్ మొదలైన తరువాత వర్షాలు లేకపోవడంతో పంటల సాగుపై తీవ్ర ప్రభావం పడింది. రంగారెడ్డి జిల్లాలో యాసంగి సీజన్‌లో సాధారణంగా 74,050 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 11,028 ఎకరాల్లో మాత్రమే రైతులు పంటలు వేశారు. అంటే కేవలం ఈ సీజన్‌లో 14.89 శాతం మాత్రమే ఇప్పటి వరకు పంటలు సాగు చేశారు. అలాగే మేడ్చల్‌లో 32.88 శాతం, వికారాబాద్‌లో 39.06శాతం వరకు ఇప్పటి వరకు పంటలు వేశారు. అక్టోబర్, నవంబర్ నెలల్లో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవక పోవడంతో యాసంగి సాగులో ఒడిదుడుకులు ఎదురవుతున్నాయి. దీంతో యాసంగి సీజన్‌లో ప్రధాన పంటల సాగు అంతంత మాత్రంగానే ఉంది. రంగారెడ్డి జిల్లాలో యాసంగిలో 52,470 ఎకరాల్లో వరి పంట సాగు చేయాల్సి ఉండగా.. ఇప్పటి వరకు కేవలం 1,369 ఎకరాల్లో మాత్రమే పంట వేశారు. అయితే ఇంకా అనేకచోట్ల నారుమళ్లు నాటడానికి సిద్ధంగా ఉన్నాయి. అలాగే వికారాబాద్‌లో 45,620 ఎకరాల్లో వరి సాగు చేయాల్సి ఉండగా.. ఇప్పటి వరకు 3,763 ఎకరాల్లో నాట్లు వేశారు. మేడ్చల్ జిల్లాలో 9,745 ఎకరాల్లో సాగు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 1,475 ఎకరాల్లో వరి వేశారు. వర్షాలు లేకపోవడంతో భూగర్భజలాల లభ్యతపై రైతుల్లో కూడా ఆందోళన నెలకొంది.

మూడు జిల్లాల్లో యాసంగి పంటల సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)

జిల్లా	సాధారణ సాగు	ఇప్పటివరకు సాగైంది	శాతం
రంగారెడ్డి	74,050	11,028	14.89
మేడ్చల్	10,132	3,331	32.88
వికారాబాద్	87,694	34,249	39.06



జేపీ దర్గాలో ఘనంగా ఖత్మేఖురాన్

ముగిసిన దర్గా ఉర్సు ఉత్సవాలు



ఉర్సుకు హాజరైన భక్తులు

కొత్తూర్, జనవరి 20: మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వ గ్రామ శివారులో గల హజ్రత్ జహంగీర్‌పీర్ దర్గా ఉర్సు ఉత్సవాలు శనివారం ఖత్మేఖురాన్‌తో ప్రశాంతంగా ముగిశాయి. ఈ నెల 18న ప్రారంభమై మూడు రోజుల పాటు జరిగిన ఉర్సు ఉత్సవాలకు వేలాది మంది తరలి వచ్చి దర్గాను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. చివరి రోజైన శనివారం దర్గా ఆవరణలో గల మజీద్‌లో ముస్లింలు ప్రత్యేక నమాజులు నిర్వహించారు. అనంతరం మత గురువుల ఆధ్వర్యంలో ఖురాన్ పఠనం చేశారు. ఉర్సుకు అత్యధికంగా భక్తులు హైదరాబాద్‌తో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రల నుంచి కూడా భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు. తలనీలాలు సమర్పించుకున్నారు. దాదాపు 30వేల మంది భక్తులు దర్గాను దర్శించుకున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఉర్సు సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కొత్తూర్ ఇన్‌స్పెక్టర్ నర్సింహారావు ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. చివరి రోజైన శనివారం హజ్రత్ జహంగీర్‌పీర్ దర్గాను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డి శనివారం దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దర్గాలో తన స్నేహితుడు నిర్వహించిన విందుకు ఆయన హాజరయ్యారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు మామిడి శ్యాంసుందర్‌రెడ్డిలు శాలువలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం కొండల్‌రెడ్డి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముజావర్లు కొండల్‌రెడ్డికి ఆశీర్వాచనలు చేసి ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు సీఈవో ఖాజామెహినోద్దీన్, కేశంపేట, ఫరూఖ్‌నగర్ జడ్పీటీసీలు విశాలశ్రవణ్, వెంకట్రామ్‌రెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు మామామిడి శ్యాంసుందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు తాండ్ర కాశీనాథ్‌రెడ్డి, పి.రఘు, శివశంకర్‌గౌడ్, జమ్రుద్‌ఖాన్, భార్గవకుమార్‌రెడ్డి, రాజుముదిరాజ్, ఖాజు తదితరులు కొండల్‌రెడ్డికి స్వాగతం పలికారు.



ప్రార్థనలు నిర్వహిస్తున్న కొండల్‌రెడ్డి, ఎమ్మెల్యే శంకర్

క్రీడా ప్రాంగణాలు నిరుపయోగం

- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మైదానాలు
- వినియోగంలోకి తేవాలంటున్న క్రీడాకారులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



పామెనలో నిరుపయోగంగా క్రీడా ప్రాంగణం

చేవెళ్ల, జనవరి 20 : గ్రామీణ ప్రాంతాల్లోని యువతను క్రీడల్లో ప్రోత్సహించేందుకు గత ప్రభుత్వం ప్రతీ గ్రామంలో తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసింది. శారీరక ధారుఢ్యం, మానసికోల్లాసానికి తోడ్పడే విధంగా గ్రామీణ ఆట స్థలాలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ స్థలాలను అధికారులు గుర్తించి ఉపాధి హామీ పథకం నిధులతో ఆ స్థలాల్లో క్రీడాప్రాంగణాలను నిర్మించారు. ఇప్పటికే దాదాపు అన్ని గ్రామాల్లో ప్రాంగణాలు పూర్తయ్యాయి. అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని పనులు పూర్తి చేయించారు. అయితే, వాటిని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకు రావడంలో విఫలమయ్యారని స్థానికులు విమర్శిస్తున్నారు. ప్రస్తుతం ఆ ప్రాంగణాలు నిరుపయోగంగా మారడంతో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాలుగా మారాయని క్రీడాకారులు వాపోతున్నారు. ఇటీవల రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడా ప్రాంగణాలపై దృష్టి సారిస్తుందా లేదా అనేది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. చేవెళ్ల మండలంలో 37 పంచాయతీలుండగా ఇందులో 25 గ్రామ పంచాయతీల్లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. మిగిలిన 12 పంచాయతీల్లో ప్రభుత్వ స్థలం సరిపడా లేకపోవడంతో ఏర్పాటు చేయలేక పోయారు. మొయినాబాద్ మండలంలో 28 గ్రామ పం చాయతీలు ఉండగా ఇందులో 15చోట్ల పూర్తిచేశారు. మిగిలిన 13 గ్రామ పంచాయతీల్లో ప్రభుత్వ స్థలం లేక పోవడంతో నిర్మించలేదు. అలాగే శంకర్‌పల్లి మండలంలో 26 గ్రామ పంచాయతీల్లో క్రీడ ప్రాంగాణాలు పూర్తి చేశారు. షాబాద్ మండలంలో 41 గ్రామ పంచాయతీలు ఉండగా.. ఇందులో 40 గ్రామ పంచాయతీల్లో క్రీడప్రాంగణాలు ఏర్పాటు చేశారు. అయితే, ఇందులో సగానికిపైగా వినియోగంలో లేవు. గ్రామాలకు దూరంగా స్థలం ఎక్కడ ఉంటే అక్కడ బోర్డులు పెట్టారు. ఆడేందుకు ప్రాంగణాలు అనువుగా లేకపోవడంతో క్రీడాకారులు మైదానాలకు వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోందని పలువురు విమర్శిస్తున్నారు.

స్థలం కొరతతో..

క్రీడా ప్రాంగణాలను ఎకరం స్థలంలో నిర్మించాలనే ప్రతిపాదనలున్నాయి. కానీ, వివిధ గ్రామాల్లో స్థలం కొరతతో ఆ ప్రతిపాదనలను కుదించారు. 10 గుంటల నుంచి ఎకరం లోపు స్థలాలను అధికారులు గుర్తించి నిర్మాణాలు చేపట్టారు. అందులో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పిల్లర్ల కోసం రూ. 55 వేలు వెచ్చించారు. స్థలాన్ని చదును చేసేందుకు స్థలాన్ని బట్టి మరిన్ని నిధులు మంజూరు చేశారు. వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేయాల్సి ఉండగా ఎక్కడా ఆ దిశలో చర్యలు చేపట్టలేదు. కొన్ని గ్రామాల్లో క్రీడాప్రాంగణం గ్రామానికి దూరంగా నిర్మించడంతో గ్రామస్తులు వినియోగించడం లేదు. కొందరు రైతులు ధాన్యం ఆరబెట్టేందుకు వాటిని వాడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకుని క్రీడా ప్రాంగణాలను వినియోగంలోకి తీసుకురావాలని ఆయా గ్రామాల క్రీడాకారులు, ప్రజలు కోరుతున్నారు.

క్రీడా ప్రాంగణాలను వినియోగంలోకి తేవాలి



ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలలో సరైన ఏర్పాట్లు లేవు. గ్రామాలకు దూరంగా నిర్మించడంతో ఎవరూ పట్టించుకోవడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలు కనుమరుగు కాకుండా ఏర్పాటు చేసిన క్రీడా మైదానాలకు కంచెవేసి కాపాడాలి. క్రీడల్లో మంచి ప్రతిభ కనబర్చేలా క్రీడాకారులను ప్రోత్సహించాలి. క్రీడా ప్రాంగణాలపై ప్రభుత్వం, అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి వాటిని వినియోగంలోకి తేవడంతో పాటు క్రీడాకారులకు కావాల్సిన అన్ని రకాల సౌకర్యాలను కల్పించాలి.

\- హరీశ్వర్‌రెడ్డి, క్రీడాకారుడు, తంగడ్‌పల్లి

పంచాయతీలకు కిట్లు పంపిణీ చేశాం



గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశాం. స్థలాల కొరత వల్లకొన్ని గ్రామాల్లో ఇబ్బందులు ఎదుర్కొన్నాం. అయినా క్రీడా మైదానాలు నిర్మించాం. క్రీడలకు సంబంధించిన కిట్లను కూడా ఆయా గ్రామ పంచాయతీ సర్పంచ్‌లకు అందజేశాం. క్రీడాకారులకు సౌకర్యాలు కల్పిస్తాం.

\- విఠలేశ్వర్, ఎంపీవో, చేవెళ్ల

23న పరిగిలో.. జాబ్‌మేళా

పరిగి/వికారాబాద్, జనవరి 20: నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు ఈ నెల 23న పరిగిలోని జడ్పీహెచ్ఎస్ నం:1 మైదానంలో మెగా జాబ్‌మేళాను నిర్వహిస్తామని జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి షేక్ అబ్దుల్ సుభాన్ శనివారం తెలిపారు. రాష్ట్రంలోని ప్రముఖ 50 కంపెనీల్లో ఐదువేల మందికి ఉద్యోగాలు కల్పించే అవకాశం ఉందన్నారు. అభ్యర్థులు టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, ఎంబీఏ, ఎంసీఏ, బీఈ, బీటెక్ విద్యార్హత కలిగి ఉండాలని సూచించారు. వైద్య రంగం, మార్కెటింగ్, భవన నిర్మాణ రంగం, రీటైల్, మార్కెటింగ్, ఫైనాన్స్, అకౌంట్స్ తదితర కంపెనీల్లో ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేసి శిక్షణ ఇచ్చి ఉద్యోగాలిస్తారని వివరించారు. మరిన్ని వివరాలకు అభ్యర్థులు 9676947444/ 9182477163/6305197076 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

ఎస్ఎంసీ ఎన్నికలకు షెడ్యూల్ జారీ

● 24న తుది జాబితా ● 29న ఎన్నికలు

మేడ్చల్ జనవరి 20(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రభుత్వ పాఠశాలల విద్యా కమిటీల ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర విద్యాశాఖ శుక్రవారం జారీ చేసింది. దీంతో శనివారం హెచ్ఎంలు నోటీసులు జారీచేశారు. దీంతో పాఠశాలల్లో ఎన్నికల కోలాహలం నెలకొంది. ప్రభుత్వ బడుల్లో చేపట్టే అభివృద్ధి, ఇతరత్రా కార్యక్రమాలపై నిర్ణయాలు తీసుకునే ఎస్ఎంసీ(స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ) ఎన్నికలకు ప్రాధాన్యం సంతరించుకుంది. 2019 నవంబరులో విద్యా కమిటీ చైర్మన్ ఎన్నికలు జరిగాయి. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 375 ప్రాథమిక, 22 ప్రాథమికోన్నత, 108 ఉన్నత పాఠశాలలు, 10ఎయిడెడ్ పాఠశాలలు మొత్తం 515 స్కూళ్లలో ఈ నెల 29న ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహిస్తారు. విద్యార్థుల తల్లిదండ్రుల పేర్లను పాఠశాల ఆవరణలో ప్రదర్శించారు. ఎన్నికల్లో పాల్గొనే తల్లిదండ్రుల జాబితాపై 22న అభ్యంతరాలు స్వీకరిస్తారు. 24న పోటీలోని తుది జాబితా ప్రదర్శిస్తారు. 29న ఉదయం 7 నుంచి ఒంటి గంట వరకు చేతులు ఎత్తే లేదా వాయిస్ విధానంతో ఎన్నిక నిర్వహిస్తారు. అదే రోజు కొత్తగా ఏర్పడిన కమిటీతో సమావేశం నిర్వహిస్తారు. చైర్మన్, వైస్‌చైర్మన్ సహా ఒక్కో తరగతి నుంచి ముగ్గురు ఎన్నికైన తల్లిదండ్రులు సభ్యులుగా ఉంటారు. మరో ఐదుగురు ఎక్స్‌అఫీషియో, ఇద్దరు కో-ఆప్షన్ సభ్యులుంటారు. హెచ్ఎం కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. 1-8 తరగతుల విద్యార్థుల తల్లిదండ్రులే సభ్యులుగా ఉంటారు. 9, 10 తరగతుల విద్యార్థుల తల్లిదండ్రులకు పోటీకి అవకాశం లేదు. ఎన్నిక సమయంలో కనీసం 50శాతం మంది తల్లిదండ్రులు హాజరుకావాలి. హెచ్ఎం ఎన్నికను నిర్వహిస్తారు. ఎన్నికల్లో పొరపాట్లకు తావివ్వకుండా హెచ్ఎం చూడాలి.

కులకచర్ల: కులకచర్ల, చౌడాపూర్ మండలాల్లోని పాఠశాలల్లో ఎస్ఎంసీల ఎన్నికకు ఎంఈవో హబీబ్ అహ్మద్ నోటిఫికేషన్ జారీ చేశారు. కులకచర్ల మండలంలో 9 ఉన్నత, 2యూపీఎస్‌ల, 59ప్రాథమిక, 1 కేజీబీవీ, 2 గిరిజన ఆశ్రమ పాఠశాలలున్నాయి. చౌడాపూర్ మండలంలో 8 ఉన్నత, 2 యూపీఎస్, 37 ప్రాథమిక, 1 గిరిజన ఆశ్రమ పాఠశాలలు ఉన్నాయి. ఈ నెల 24న తుది జాబితా, 29న ఎన్నిక నిర్వహిస్తామని తెలిపారు.


మాట్లాడుతున్న చీఫ్ ప్రమోటర్ గోరెంకల నర్సింహ

జిల్లాలో 185 మత్స్య సహకార సంఘాల రిజిస్ట్రేషన్

- మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా అడహక్ కమిటీ చీఫ్ ప్రమోటర్ నర్సింహ

రంగారెడ్డి అర్బన్, జనవరి 20 : జిల్లాలో 185 మత్స్య సహకారం సంఘాలు రిజిస్ట్రేషన్ అయినట్లు మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అడహక్ కమిటీ జిల్లా చీఫ్ ప్రమోటర్ గోరెంకల నర్సింహ తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌లోని మత్స్యశాఖ కార్యాలయంలో శనివారం మత్స్యకారుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 185 మత్స్య సహకారం సంఘాలు రిజిస్ట్రేషన్ అయినట్లు, అందులో డీఎఫ్‌సీఎస్‌లో 127 సంఘాలు ఇప్పటికే ఓటు హక్కు పొందినట్లు చెప్పారు. ఇంకా 37 సొసైటీల జాబితాను రాష్ట్ర కోఆపరేటివ్ అథారిటీలో పెండింగ్‌లో ఉన్నట్లు చెప్పారు. ఈ సొసైటీలకు ఎన్నికలు జరగాలని, అధికారులు కృషి చేయాలని తెలిపారు. ప్రతీ సొసైటీ వాటా ధనం కింద 11 వందల రుసుం చెల్లించాలని కమిటీలో తీర్మానించారు. జిల్లా మత్స్యశాఖ అధికారి సుకీర్తి, జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు తదితరులున్నారు.

మణికొండ మున్సిపాలిటీ చైర్మన్‌పై అవిశ్వాసం

రంగారెడ్డి అర్బన్, జనవరి 20 : మణికొండ మున్సిపల్ చైర్మన్ కుర్చీకి ఎసరు పడింది. బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల్లోని కౌన్సిలర్లు కలిసి మణికొండ మున్సిపల్ చైర్మన్ కస్తూరి నరేందర్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టేందుకు సిద్ధమయ్యారు. ఈమేరకు శనివారం జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌ను 12 మంది కౌన్సిలర్లు సంతకాలతో కూడిన తీర్మాన పత్రాన్ని అందజేశారు. దాంతో మణికొండ మున్సిపాలిటీ అవిశ్వాస తీర్మానం హాట్ టాపిక్‌గా మారింది.

ఇబ్రహీంపట్నం సీఐగా ఆంజనేయులు బాధ్యతల స్వీకరణ


ఇబ్రహీంపట్నం, జనవరి 20: ఇబ్రహీంపట్నం సీఐగా కె.ఆంజనేయులు శనివారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పనిచేస్తున్న ఆర్.గోవిందరెడ్డి మేడిపల్లి సీఐగా బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో వెయిటింగ్‌లో ఉన్న ఆంజనేయులుకు ఇక్కడ పోస్టింగ్ ఇచ్చారు. ఆంజనేయులు మాట్లాడుతూ శాంతి భద్రతల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని, ప్రజలు కూడా సహకరించాలని ఆయన కోరారు. సమస్య ఏదైనా ఉంటే నేరుగా సంప్రదించవచ్చారు.

'పార్లమెంట్' బరిలో ఆచారి!

ఆమనగల్లు, జనవరి 20 : బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకుడు, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబ్‌నగర్, మల్కాజిగిరిలో ఏదేని నియోజకవర్గం నుంచి బీజేపీ తరపున బరిలో నిలిచేందుకు సిద్ధమవుతున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కల్వకుర్తి నుంచి ఆచారి పోటీచేసి 70 వేలకు పైచిలుకు ఓట్లు సాధించి స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందారు. ఆరు సార్లు అసెంబ్లీకి పోటీచేసి ఓడిపోయిన ఆచారి పార్లమెంట్‌కు పోటీకి సిద్ధమవుతున్నట్లు సమాచారం. మహబూబ్‌నగర్, మల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థానాల్లో ఏదో ఒకటి తనకు కేటాయించాలని బీజేపీ అధిష్టానాన్ని ఇప్పటికే కోరినట్లు తెలిసింది. జాతీయ స్థాయిలో పార్టీలో గుర్తింపు ఉన్న ఆచారి ఎలాగైనా అభ్యర్థిత్వాన్ని దక్కించుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నారని, మోదీ గాలి వీస్తున్నందున సునాయసంగా గెలవవచ్చన్న భావనలో ఉన్నట్లు తెలిసింది. రాష్ట్రం నుంచి పంపిన పేర్లలో ఆచారి పేరు కూడా ఉన్నట్లు సమాచారం.

మెరుగైన వసతుల కల్పనే ధ్యేయం

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి


ఎంపీ రాములుతో కలిసి బెక్కెర గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు, జనవరి 20 : ప్రజలకు మెరుగైన వసతుల కల్పనే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. నియోజకవర్గంలో శనివారం ఎమ్మెల్యే విస్తృతంగా పర్యటించారు. బెక్కెరలో రూ.25 లక్షలతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ఎంపీ రాములు, జడ్పీ వైస్‌చైర్మన్ బాలాజీ సింగ్, జడ్పీటీసీ భరత్ కుమార్, ఎంపీపీ మనోరమ, సర్పంచ్ పాండు రంగారెడ్డిలతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థలను బలోపేతం చేసి గ్రామస్థాయి ప్రజాప్రతినిధుల గౌరవం పెంచేలా ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తుందన్నారు. సర్పంచ్‌లకు రావాల్సిన పెండింగ్ బిల్లులను ప్రభుత్వం త్వరలో విడుదల చేస్తుందన్నారు. ఎంపీ మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలు ఉత్పన్నం కాకుండా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. ఈజీఎస్‌తో చాలా గ్రామ పంచాయతీలకు భవనాలు నిర్మించడం జరిగిందని, భవనాలు లేని పంచాయతీలు ఉంటే నిర్మాణానికి కృషి చేస్తామని తెలిపారు. హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిని త్వరలో విస్తరిస్తామన్నారు. మాజీ జడ్పీటీసీ అశోక్‌రెడ్డి, వైస్ ఎంపీపీ గోవర్ధన్, సర్పంచ్ శ్రీలత, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, జిల్లా నాయకుడు రాజేశ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికే 'ఆరు గ్యారంటీలు'


ఖైరంపల్లి జీపీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొందుర్గు, జనవరి 20: పేదల సంక్షేమం కోసమే ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేయనున్నట్లు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం మండల పరిధిలోని ఖైరంపల్లిలో నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని సర్పంచ్ ఆంజనేయులు, ఎంపీటీసీ భారతమ్మతో కలిసి ప్రారంభించారు. అంతకుముందు గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. అక్కడే కాంగ్రెస్ పార్టీ జెండాను పార్టీ మడలాధ్యక్షుడు ఎ.కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ యూపీఏ చైర్‌పర్సన్‌గా సోనియాగాంధీ ఉన్న సమయంలోనే ఉపాధి హామీ పథకాన్ని ప్రారంభించారని గుర్తుచేశారు. ఈజీఎస్ నిధులతో జీపీ భవనాన్ని రూ.20లక్షలతో నిర్మించడం జరిగిందని, సర్పంచ్‌ల బిల్లులను పెండింగ్‌లో పెట్టవద్దని అధికారులకు సూచించారు. పరిశీలన చేసి అర్హులందరికీ గ్యారెంటీ పథకాలు వర్తింపజేస్తామన్నారు. ఖైరంపల్లి అభివృద్ధికి, ఆలయం నిర్మాణానికి సాయం చేస్తానని హామీ ఇచ్చారు. తహసీల్దార్ రమేష్‌కుమార్, ఎంపీడీవో ఆంజనేయులు, నాయకులు కృష్ణారెడ్డి, జితేందర్‌రెడ్డి, పు రుషోత్తంరెడ్డి, అంజిరెడ్డి, మల్లేష్, శేఖర్, యాదయ్య, రామయ్య సిద్దు, జహంగీర్, లింగమయ్యగౌడ్, రాంచంద్రయ్య రోహిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించాలి

- మండల సమావేశంలో ఎమ్మెల్యే సబితారెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

కందుకూరు జనవరి 20 : ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. శనివారం ఎంపీపీ మంద జ్యోతి అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ సమావేశానికి సబిత ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఉద్యానవన శాఖ ద్వారా ప్రభుత్వం సబ్సిడీపై ఆయిల్‌పామ్ తోటల పెంపకానికి తోడ్పాటునందిస్తున్నట్లు తెలిపారు. మండలంలో ప్రతి గ్రామంలో 10 నుంచి 20 బెల్టుషాపులు నడుపుతున్నా ఎక్సైజ్ అధికారులు చోద్యం చూపుతున్నట్లు ఎంపీటీసీలు రాజశేఖర్‌రెడ్డి, మంచాల యాదయ్యలు ఆరోపించారు. ఎక్సైజ్ ఎస్సై హనుమంతునాయక్ మాట్లాడుతూ తమ పరిధిలోకి రావని(తడబడుతూ) చెప్పడంతో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఆయన్ను నిలదీశారు. దాంతో నెలరోజుల్లో బెల్టుషాపులను మూసివేయిస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బెల్టుషాపులను బంద్ చేయడానికి సభ్యులు అధికారులను ఎలాగైతే నిలదీస్తున్నారో గ్రామాల్లో ఈత, తాటి చెట్లను పెంచడానికి ప్రజలను చైతన్యం చేయాలన్నారు. మండలంలో అసైన్డ్ భూముల్లో మట్టి తవ్వకాలు అధికంగా జరుగుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సబిత తహసీల్దార్ గోపాల్‌ను ఆదేశించారు. కాగా, గ్రామపంచాయతీల్లో చేపట్టిన పనులకు బిల్లులు విడుదల చేయాలని కోరుతూ మండల సర్పంచ్‌ల ఫోరం ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇచ్చారు. ముచ్చర్లను ఫార్మసిటీ పోలీస్టేషన్‌లో విలీనం చేయడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నట్లు ఎంపీటీసీ మల్లేష్ సభ దృష్టికి తెచ్చారు. కందుకూరు పోలీస్టేషన్ పరిధిలో కలపాలన్నారు. జడ్పీటీసీ జంగారెడ్డి, వైఎస్ ఎంపీపీ శమంతప్రభాకర్‌రెడ్డి తదితరులున్నారు.

ఎయిడ్స్ పట్ల అవగాహన కలిగి ఉండాలి


ఇబ్రహీంపట్నం : కళాజాత బృందంతో అవగాహన

చేవెళ్ల/ఇబ్రహీంపట్నం, జనవరి 20 : ఎయిడ్స్ పట్ల అవగాహన కలిగి ఉండాలని జోనల్ సూపర్‌వైజర్ రాములు తెలిపారు. చేవెళ్ల మండల పరిధిలోని కందవాడలో వైఆర్ జీకేర్ ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాములు మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతీఒక్కరు హెచ్ఐవీ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సిబ్బంది అనంతలక్ష్మి, గ్రామస్తులు తదితరులున్నారు. అలాగే ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖల ఆధ్వర్యంలో శనివారం ఇబ్రహీంపట్నంలో హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై కళాజాత నిర్వహించారు. ఇక్కడ చౌరస్తా సమీపంలో సుంచు లింగయ్య పల్లె సుద్దుల కళా బృందం ఎయిడ్స్‌పై అవగాహన కల్పించింది. అనుమానితులు ఎయిడ్స్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోని ఐసీటీసీ కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహిస్తారని దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. నేటి యువతలో కొందరు విచ్చలవిడి శృంగారాన్ని కోరుకుంటున్నారని, అది ఎంతమాత్రం మంచిది కాదన్నారు. ఐసీటీసీ కౌన్సిలర్ అనిల్, వీఎస్ఎస్ ఏఏ వన్ మైగ్రేట్ సంస్థ సీఎం రాఘవ, కౌన్సిలర్ రేణుక, ఓఆర్‌డబ్ల్యు కైలాస్ తదితరులున్నారు.


చేవెళ్ల : అవగాహన కల్పిస్తున్న సిబ్బంది


నోట్‌పుస్తకాలు అందిస్తున్న భీంభరత్, దాత అజీజ్

విద్యార్థులకు చేయూత అభినందనీయం

శంకర్‌పల్లి, జనవరి 20 : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు దాతలు చేయూతనివ్వడం అభినందనీయమని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఇన్‌చార్జి పామెన భీం భరత్ అన్నారు. శనివారం దొంతాన్‌పల్లికి చెందిన దాత అజీజ్ సుమారు 70 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు, బ్యాగులు, షూస్, శానిటైజర్, మాస్క్‌లను సొంత డబ్బుతో సమకూర్చారు. భీంభరత్‌తో కలిసి ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అశ్విని సుధాకర్, ప్రకాశ్‌గుప్తా, ఉదయ్‌మోహన్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, కాశెట్టి మోహన్, ఏజాస్, శ్రీనివాస్ తదితరులున్నారు.

రేపు చిలుకూరులో ప్రత్యేక పూజలు

- బాలాజీ ఆలయం ప్రధాన అర్చకుడు రంగరాజన్
- అయోధ్య బాల రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకొని దేవాలయాల శుద్ధి


షాద్‌నగర్ : వేంకటేశ్వరాలయంలో నిర్వహించిన స్వచ్ఛ తీర్థ్ కార్యక్రమంలో బీజేపీ నాయకులు

మొయినాబాద్ రూరల్, జనవరి 20: అయోధ్య బాల రాముడి విగ్రహం ప్రాణప్రతిష్ఠాపనను పురస్కరించుకొని మొయినాబాద్ మండలం చిలుకూరు బాలాజీ ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ప్రధాన అర్చకుడు సీఎస్ రంగరాజన్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు మహాపరిక్రమ, అంతర్గత పరిక్రమ కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు. మంగళ వాయిద్యాలు, రామ నామ, పారాయణాలు మొదలైన వాటితో దేవాలయం నుంచి చిలుకూరు గ్రామంలోని ఆంజనేయస్వామి దేవాలయం వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు ఈ సందర్భంగా రంగరాజన్ చెప్పారు.

షాద్‌నగర్ : ధర్మానికి ప్రతీకగా శ్రీరామచంద్రుడు మాత్రమే నిలుస్తాడని బీజేపీ నాయకులు వ్యాఖ్యానించారు. అన్ని ఆలయాల్లో స్వచ్ఛతీర్థ్ కార్యక్రమం చేపట్టాలంటూ ప్రధాని పిలుపు మేరకు పట్టణంలోని వేంకటేశ్వరాలయంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చెంది మహేందర్‌రెడ్డి, అందెబాబయ్య, శ్రీవర్ధన్‌రెడ్డి, అశోక్‌గౌడ్, చెట్ల వెంకటేష్‌ల ఆధ్వర్యంలో స్వచ్ఛతీర్థ్ కార్యక్రమం చేపట్టారు.

షాబాద్ : అయోధ్యలో భవ్య రామమందిర నిర్మాణంతో దేశ ప్రజల చిరకాల కోరిక నెరవేరిందని రామాలయం ప్రధాన అర్చకులు శ్రీనివాసాచారి అన్నారు. దేవాలయం శనివారం ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం ఉదయం 9 గంటలకు షాబాద్‌లోని రామాలయం నుంచి మల్కాబావి వద్ద గల శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం వరకు శోభాయాత్ర ఉంటుందని, భక్తులు పాల్గొనాలని కోరారు.

చౌదరిగూడ : ధర్మానికి ప్రతీక శ్రీరామ చంద్రుడని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కమ్మరి భూపాలచారి అన్నారు. పెద్దఎల్కిచర్లలో హనుమాన్ ఆలయం, శివాలయంలో స్వచ్ఛ తీర్థ్ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రధాని పిలుపు మేరకు గ్రామంలోని దేవాలయాలను శుద్ధి చేయడం జరిగిందని అన్నారు.

శంషాబాద్ రూరల్ : శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠాపనను పురస్కరించుకుని మండల పరిధిలోని నర్కూడ అమ్మపల్లి శ్రీ అభయఆంజనేయస్వామి ఆలయాన్ని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బుక్క వేణుగోపాల్ నాయకులు ఆలయాన్ని శుద్ధి చేశారు. ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి కుమార్‌యాదవ్, బీజేవైఎం మండలాధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, నర్కూడ సర్పంచ్ సిద్దులు, నగేష్‌గౌడ్, తదితరులున్నారు.

కేశంపేట : వేముల్‌నర్వ గ్రామంలో ఆయోధ్య అక్షింతలు ఇంటింటికీ పంపిణీ చేశారు. 22న ఆలయం ప్రతీ ఒక్కరు రామదీపం వెలిగించాలని కోరారు. మల్లేష్, పర్వతాలు, ఆనంద్ రెడ్డి, రాఘవేందర్, శివ, నరేందర్, మురళీ, శ్రీకాంత్ తదితరులున్నారు.

బీజేపీ సిద్ధాంతాలు కాగితాలకే పరిమితం


మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

షాద్‌నగర్, జనవరి 20(ఆంధ్రజ్యోతి) : బీజేపీ సిద్ధాంతాలు కేవలం కాగితాలకు మాత్రమే పరిమితమని, ఆచరణలో ఎక్కడా కనిపించవని సీపీఐ ఎమ్మెల్యే, ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రావడం కోసమే అయోధ్య శ్రీరాముడిని తెరపైకి తెచ్చిందన్నారు. శనివారం రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్లో ఏర్పాటు అభినందన సభలో సీపీఐ కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌లు పాల్గొన్నారు. కూనంనేని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని గాలికొదిలేసి కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తుందన్నారు. బీఆర్ఎస్ నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో తెలంగాణలో అధికారంలోకి వచ్చిందని, పదేళ్ల పాలించినా అందులో ఒక్కటి కూడా నెరవేర్చలేదన్నారు. అందువల్లనే ఆ పార్టీని ప్రజలు గద్దెదించిన విషయాన్ని గుర్తుంచుకోవాలని తెలిపారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్వతహాగా కమ్యూనిస్టు కానప్పటికీ.. ఆయనలో కూడా కమ్యూనిస్టు భావజాలాలు ఉన్నాయని కొనియాడారు. వీర్లపల్లి మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్, సీపీఐలు పేదల పక్షపాతిగా నిలిచాయన్నారు. అసెంబ్లీలో ఒక్కరిగా నిలిచి ప్రజల గొంతుకను వినిపించేందుకు కూనంనేని సిద్ధంగా ఉన్నారని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, జడ్పీటీసీలు విశాలాశ్రవణ్ రెడ్డి, వెంకట్‌రామ్‌రెడ్డి, సీపీఐ నేతలు బుద్దుల జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ జిల్లా సలహా కమిటీ సభ్యుడిగా రూపక్


ఇబ్రహీంపట్నం, జనవరి 20: నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ జిల్లా సలహా కమిటీ సభ్యుడిగా సూరంపల్లి రూపక్‌ను నియమించారు. సంఘటన్ డైరెక్టర్ జనరల్ నితేష్‌కుమార్ మిశ్రా శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో యువత అభివృద్ధి, నైపుణ్యాల పెంపునకు కృషి చేస్తానని రూపక్ అన్నారు. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రి అనురాగ్‌సింగ్ ఠాకూర్, రాష్ట్ర బీజేపీ నాయకత్వానికి కృతజ్ఞతలు చెప్పారు.

పీఆర్ డీఈఈగా శ్రీనివాస్ రెడ్డి

ఆమనగల్లు, జనవరి 20 : సబ్ డివిజన్ పంచాయతీ రాజ్ డీఈఈగా హయత్‌నగర్‌లో ఏఈగా పనిచేసిన శ్రీనివాస్‌రెడ్డి పదోన్నతిపై శనివారం ఇక్కడ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న యాదగిరి పదోన్నతిపై మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి వెళ్లారు. ఆమనగల్లు సబ్ డివిజన్ కార్యాలయంలో ఆయన్ను ఏఈలు కృష్ణయ్య, పరమేశ్, సూర్యవంశీ, అభిషేక్‌లు సత్కరించారు.

మంత్రి దామోదరకు ఘన స్వాగతం

ఆమనగల్లు, జనవరి 20: రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు ఆమనగల్లులో శనివారం ఘన స్వాగతం లభించింది. మంత్రి పదవి చేపట్టి తొలిసారిగా నాగర్‌కర్నూల్ జిల్లాలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనడానికి వెళ్తున్న మంత్రికి కాంగ్రెస్ నాయకులు బ్యాండ్ వాయిద్యాలతో ఎదురేగి స్వాగతం పలికారు. పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రిని 150 పడకలకు పెంచి విశాల భవనం నిర్మించాలని నాయకులు మంత్రిని కోరారు. ఖాళీగా ఉన్న వైద్యులు, సిబ్బంది పోస్టులు భర్తీచేసి రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని అభ్యర్థించారు. మంత్రి సానుకూలంగా స్పందించారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు తెల్గమల్ల జగన్, పట్టణాధ్యక్షుడు వస్పుల మానయ్య, జిల్లా నాయకులు రవీందర్ నాయక్, కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి కృష్ణనాయక్, నాయకులు వస్పుల శ్రీశైలం, ఖాదర్, అలీం, వస్పుల శ్రీకాంత్, ఫరీద్, నాజర్, రాఘవేందర్, రాజశేఖర్, శ్రీధర్, కొండల్‌రెడ్డి, శివాజీ, కుమార్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

- **శంకర్‌పల్లి ;** ప్రభుత్వ పాఠశాలలో సరస్వతీ దేవి విగ్రహం ఏర్పాటు అభినందనీయమని ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. మహలింగాపురంలో బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి ఏర్పాటుచేసిన విగ్రహాన్ని ఆవిష్కరించారు.
- **ఆమనగల్లు :** అయోధ్యలో బాల రాముడి ప్రాణప్రతిష్ఠ, ఆలయ ప్రారంభోత్సవం నేపథ్యంలో రేపు (సోమవారం) రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు సెలవు ప్రకటించాలని హిందూ దళం సభ్యులు కోరారు. శనివారం పలు శాఖల అధికారులకు వినతిపత్రం అందజేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో శ్రీశైలం, శ్రీకాంత్, క్రాంతి, శ్రవణ్, తదితరులు ఉన్నారు.
- **ఆమనగల్లు :** కడ్తాల, ఆమనగల్లు, తలకొండపల్లి, మాడ్గుల మండలాల పరిధిలో ప్రత్యేక ఓటరు మోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్డీవో శ్రీను, తహసీల్దార్ లలితలు పాల్గొన్నారు.
- **షాద్‌నగర్ :** షాద్‌నగర్ పట్టణానికి చెందిన డెంటల్ డాక్టర్ సంధ్య శుక్రవారం రాత్రి స్వామి వివేకానంద సేవా పురస్కారం 2024 అవార్డును అందుకున్నారు. నవభారతి నిర్మాణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగరంలోని తెలంగాణ పరిషత్ ఆడిటోరియంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలు నిర్వహించారు. శాసనమండలి డిప్యూటీ చైర్మన్ ప్రకాశ్‌ముదిరాజ్, తదితరుల చేతులమీదుగా అవార్డు అందుకున్నారు.
- **శంకర్‌పల్లి :** విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని అంకుర హోమ్స్ అండ్ డెవలపర్స్ అధినేతలు జైపాల్‌రెడ్డి, రవికాంత్‌రెడ్డి, వెంకట్‌లు అన్నారు. మోకిలలోని క్రీడా ప్రాంగణంలో 13 ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. మొదటి బహుమతి రూ.25వేలు, రెండో బహుమతి రూ.15వేలు ట్రోఫీలను అందచేశారు.
- **యాచారం :** ఓటరు నమోదుకు 26 మంది కొత్తగా దరఖాస్తు చేసుకున్నారు. అడ్రస్‌లో మార్పులు, చేర్పులకు 8 మంది దరఖాస్తు చేసుకున్నారని తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి చెప్పారు.
- **మొయినాబాద్ రూరల్ :** కష్టపడి చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ చీఫ్ అడ్మినిస్ట్రేటర్ ఆఫీసర్ డాక్టర్ సాత్వికరెడ్డి అన్నారు. హిమాయత్‌నగర్‌లోని యూనివర్సిటీలో చదువుతున్న గౌతమి, చిత్తకుంట్ల నర్సయ్యలు వివిధ విభాగాల్లో పరిశోధనకు డాక్టరేట్లు పొందగా పట్టాలు అందజేశారు.
- **షాబాద్ :** బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని ఎస్ఐ రాజేందర్ అన్నారు. చందన్‌వెల్లి పారిశ్రామికవాడ కుందన్ టెక్స్‌టైల్స్ కంపెనీలో పనిచేస్తున్న ఇతర రాష్ట్రాల కూలీల పిల్లలు 17మందిని చందన్‌వెల్లి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. డీసీపీయూ సంజీవ, విద్యాశాఖ సీఆర్పీ యాదయ్య, తదితరులున్నారు.
- **ఆమనగల్లు :** జిల్లా మత్స్యకారుల సొసైటీ డైరెక్టర్‌గా తలకొండపల్లి మండలం రాంపూర్ గ్రామానికి చెందిన వెంకటయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తలకొండపల్లి మండల కేంద్రంలో సంఘం ఆధ్వర్యంలో అభినందన కార్యక్రమాన్ని నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి పద్మ అనిల్ ఆధ్వర్యంలో నిర్వహించి సన్మానించారు.

క్రైం కార్నర్

చెరువులో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

కొత్తూర్, జనవరి 20: మున్సిపాలిటీలోని కుమ్మరిగూడ శివారులో గల గోదుమకుంట చెరువులో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై జి.శ్రీనివాస్ తెలిపారు. కుమ్మరిగూడకు చెందిన మైలారం ఈశ్వరయ్య(45) ఈనెల 18న రాత్రి చేపల వేటకు వెళ్లి చెరువులో మునిగిపోయిన విషయం పాఠకులకు తెలిసిందే. ఈశ్వరయ్య కోసం ఎన్డీఆర్ఎఫ్ బృందం శుక్రవారం గాలింపు జరిపినా ఫలితం లేకపోయింది. శనివారం ఉదయం ఈశ్వరయ్య మృతదేహం నీటిపై తేలడంతో శవపరీక్ష కోసం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించి, కుటుంబసభ్యులకు అప్పగించినట్లు తెలిపారు. మృతుడి తండ్రి నర్సింహులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో జింక మృత్యువాత

షాబాద్, జనవరి 20 : అనుమానాస్పద స్థితిలో జింక మృతిచెందిన ఘటన మండల పరిధిలోని చిన్నసోలిపేట సమీపంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. చిన్నసోలిపేట సమీపంలోని వ్యవసాయ పొలాల వద్ద దుర్వాసన వస్తుండటంతో రైతులు గమనించగా..జింక చనిపోయి ఉంది. కాగా, అది చిలుకూరు అటవీ ప్రాంతం నుంచి వచ్చి ఉండవచ్చని అటవీ అధికారులు తెలిపారు. ఏదైనా విషాహారం తిని గానీ, చాలా దూరం పరిగెత్తినప్పుడు గుండెపోటు వచ్చి మరణించే అవకాశం గానీ ఉందని తెలిపారు. కాగా, పోలీసులు, అటవీ అధికారులకు ఈ సంఘటనపై సమాచారం లేదని తెలిపారు. అది రెండు మూడు రోజుల క్రితం మరణించి ఉండవచ్చని రైతులు తెలిపారు.

గేదె దూడ మృతి.. మూడింటికి తీవ్రగాయాలు

నందిగామ, జనవరి 20 : గుర్తుతెలియని జంతువుల దాడిలో ఓ గేదె దూడ మృతిచెందగా పలు దూడలు తీవ్రంగా గాయపడిన ఘటన మండల పరిధిలోని అంతిరెడ్డిగూడ శివారులో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. కొన్ని రోజులక్రితం నందిగామ, కొత్తూరు మండలాల పరిసరాల్లో క్రూరమృగాల దాడిలో వరుసగా లేగ, గేదెదూడలు మృతిచెందాయి. రాత్రివేళల్లో వరుస సంఘటనలు జరగడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అయితే, అటవీ అధికారులు, పోలీసులు ఒకవేళ చిరుత దాడి చేస్తే మెడ, కడుపు భాగంలో గాయపర్చుతుందని, హైనా అయితే వీపు భాగంలో దాడి చేసి గాయపరుస్తుందని రైతులకు అవగాహన కల్పించారు. కొన్ని రోజుల తర్వాత నందిగామ మండలం అంతిరెడ్డిగూడకు చెందిన ఎంబడి బాల్‌రాజ్‌యాదవ్ పశువుల కొట్టంపై గుర్తుతెలియని జంతువుల దాడిలో గేదె దూడ మృతిచెందడంతో పాటు మూడు తీవ్రంగా గాయపడ్డాయి. సంఘటన స్థలాన్ని ఫారెస్ట్ అధికారులు పరిశీలించి రైతుల్లోని భయాన్ని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు 'బెస్ట్' అవార్డు

శంషాబాద్ రూరల్, జనవరి 20 : శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి మాస్టర్ ఆఫ్ పబ్లిక్ పాలసీ అండ్ అడ్మినిస్ట్రేషన్ అంశాల్లో బెస్ట్ ఎయిర్‌పోర్టు అవార్డు లభించింది. ఈమేరకు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా చేతుల మీదుగా అవార్డును అందుకున్నట్లు జీఎంఆర్ ప్రతినిధులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వారు మాట్లాడుతూ ఎయిర్‌పోర్టుకు అవార్డు రావడం ఎంతో సంతోషంగా ఉందని వారు తెలిపారు. గతంలో కూడా ఎయిర్‌పోర్టుకు అనేక అవార్డులు వచ్చాయని, ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడంతోనే అవార్డు దక్కిందని జీఎంఆర్ ప్రతినిధులు పేర్కొన్నారు.

కేంద్ర పథకాలను వినియోగించుకోవాలి


పీర్జాపూర్‌లో మాట్లాడుతున్న శాంత కుమార్

చౌదరిగూడ, జనవరి 20 : కేంద్ర పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ రాష్ట్ర కోశాధికారి శాంతకుమార్ అన్నారు. శనివారం జిల్లేడ్ చౌదరిగూడ మండలం జిల్లేడ్, ముష్టిపల్లి, రావిర్యాల, పీర్జాపూర్‌లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. రాష్ట్ర నాయకులు అందె బాబయ్య, ఏవో కృష్ణమోహన్, ఎంపీహెచ్‌వో ప్రభులింగం, ఏఈవో రాజేశ్వరి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కమ్మరి భూపాలచారి, బీజేపీ మండలాధ్యక్షుడు కురుమయ్య, రాజు, బ్యాంకు సిబ్బంది శివ, మోహన్, సరళ, సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ సేవలను సద్వినియోగపర్చుకోవాలి

- తెలంగాణ గ్రామీణ బ్యాంక్ జనరల్ మేనేజర్ రమేష్

మహేశ్వరం, జనవరి 20 : కేంద్ర ప్రభుత్వం అమలు పరుస్తున్న అనేక రకాల పథకాలు పేదలకు ఎంతో ఉపయోగపడుతున్నాయని, తెలంగాణ గ్రామీణ బ్యాంకు సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బ్యాంక్ జీఎం రమేష్ అన్నారు. శనివారం మండల పరిధిలోని సిరిగిరిపురంలో బ్యాంక్ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ రూపే కార్డు ద్వారా ఎన్నో ఉపయోగాలున్నాయని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కాసుల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు పూర్వవైభవం తీసుకురావాలి


కేఎల్లార్ సమక్షంలో పార్టీలో చేరుతున్న బీఆర్ఎస్ నాయకులు

మహేశ్వరం, జనవరి 20 : మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేసి పూర్వవైభవం తేవాలని మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శనివారం తుక్కుగూడ మున్సిపల్ కేంద్రానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, తెలంగాణ ఉద్యమకారులు ఆయన నివాసంలో కాంగ్రెస్‌లో చేరారు. కేఎల్లార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు పరుస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు చేరవేయడంలో కార్యకర్తలు మరింత కృషి చేయాలన్నారు. గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాడి పాండురంగారెడ్డి, దేప భాస్కర్‌ఎడ్డి, పద్మాభాస్కర్‌రెడ్డి, కె.శ్రీనివాస్‌గౌడ్, చంద్రారెడ్డి, శేఖర్, చంద్రశేఖర్‌రెడ్డి, జానకీరామ్, రాజ్‌కుమార్, దేవేందర్, భాస్కర్‌గౌడ్, రాజేష్, మణికంఠరెడ్డి, లక్ష్మమ్మ, మంజుల, శాంతి, మాధురి, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధతతో పని చేస్తేనే గుర్తింపు



నర్సింహారెడ్డిని సన్మానించి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

మొయినాబాద్ రూరల్/శంకర్‌పల్లి, జనవరి 20: పార్టీలో నిబద్ధతతో పనిచేస్తే గుర్తింపు తనంతట తానే వస్తుందని బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి అన్నారు. మరోసారి జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన నర్సింహారెడ్డిని బీజేపీ ఓబీసీ జిల్లా కన్వీనర్, సీనియర్ నాయకుడు ఎల్లని వెంకటేష్‌గౌడ్ ఆయన్ను తన నివాసంలో శనివారం కలిసి అభినందనలు తెలిపారు. అలాగే నర్సింహారెడ్డిని జిల్లా అధికార ప్రతినిధి తొండరవి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శంకర్‌పల్లి మున్సిపల్ అధ్యక్షుడు సురేష్, తదితరులున్నారు.

బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్‌కు సన్మానం

చేవెళ్ల, జనవరి 20 : బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన మహేందర్‌ను చేవెళ్ల మండల బీజేపీ నాయకులు ఘనంగా సత్కరించారు. శనివారం నగరంలో మహేందర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి అనంత్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షుడుగా మహేందర్ కావడం గొప్ప విషయమన్నారు. రంగారెడ్డి జిల్లా వాస్తవ్యుడు అధ్యక్షుడు కావడం జిల్లాకే గర్వకారణం అని అన్నారు.